ఇక్కడంతా.. క్షేమం

- వార్డులో అభివృద్ధిపై దుర్గమాంబ సమాజం ప్రజల సంతోషం
- గడప గడపకు కార్యక్రమం తమ బాధలు తీర్చిందని వెల్లడి



కల్లుపాకల్లో అభివృద్ధి చేసిన యూజీడీ డ్రెయిన్లు



దుర్గమాంబ సమాజంలో బాగు చేసిన కమ్యూనిటీ హాలు

జగదాంబ: అనేక సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలు ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పరిష్కారం అవుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తమకు ఎంతగానో ఉపయోగపడిందని చెబుతున్నారు. ఆ కార్యక్రమం వల్ల నాయకులు ప్రతి ముంగిటకు వచ్చి సమస్యలేమిటో తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాలకు వచ్చిన నిధులతో వార్డుల్లో చక్కటి సౌకర్యాలు కల్పించారని తెలిపారు. జీవీఎంసీ 35వ వార్డులో కల్లుపాకలు, దుర్గమాంబ సమాజం తదితర ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కారం అయ్యాయని స్థానిక మహిళలు చెబుతున్నారు. శిథిలమైన మురుగు కాలువలు, నిండిపోయి దుర్గంధం వెదజల్లే అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, తాగునీటి వెతలు, కాలువల పరిశుభ్రత వంటి పలు సమస్యలు త్వరితగతిన పరిష్కారమైనట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో..

దుర్గమాంబ సమాజంలో కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇక్కడి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో స్థానికులు సభలు, సమావేశాలు, శుభకార్యాలు జరుపుకుంటున్నారు. అలాగే దుర్గమాంబ సమాజంలోని కల్లుపాకలు వీధిలో యూజీడీలు నిండిపోయి దుర్వాసనతో ఇబ్బంది పడేవారిమని స్థానికులు చెబుతున్నారు. స్థానిక కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్య పరిష్కరించారని తెలిపారు. అలాగే కల్లుపాకలు, గాజులవీధిలో పూర్వం నిర్మించిన కాలువలు కొన్నిచోట్ల శిథిలమై మురుగు, చెత్త సాఫీగా ముందుకెళ్లడం లేదని, వాటిని కూడా మరమ్మతు చేస్తే ఇంటి ముందు పరిశుభ్రంగా ఉంటుందని చెబుతున్నారు.

ఇప్పుడు బాగున్నాయి..



మా ప్రాంతంలోని వీధుల్లో యూజీడీ డ్రెయిన్లు, కాలువలు ఇప్పుడు బాగున్నాయి. గతంలో ఈ సమస్యలపై అధికారులకు చెప్పి చెప్పి విసిగిపోయాం. ఇప్పుడు ఫిర్యాదు చేయగానే వెంటనే సమస్యలు పరిష్కరిస్తున్నారు.

–ఎల్లమ్మ, కల్లుపాకలు ప్రాంతం, 35వ వార్డు.

పరిస్థితులు మారాయి..



గతంలో వలే కాకుండా ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఏ సమస్య వచ్చినా చెప్పగానే పరిష్కరిస్తున్నారు. అలాగే కొన్నిచోట్ల మురుగు కాలువలపై కూడా దృష్టి సారిస్తే మరింత బాగుంటుంది. కాలువల పరిశుభ్రానికి సిబ్బందితో పాటు సెక్రటరీలు కూడా ఉంటే బాగా శుభ్రం చేస్తారు.

–వరలక్ష్మి, దుర్గమాంబ సమాజం, 35వ వార్డు.

అన్ని సమస్యలు పరిష్కరిస్తాం



వార్డులో ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరిస్తున్నాం. ప్రధానమైన యూ జీడీ, సిమెంట్ రోడ్లు, తాగు నీరు వంటి ముఖ్యమైన సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి ముందుగా పరిష్కరించాం. కాలువలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, యువతకు ఉపాధి వంటి అంశాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–విల్లూరి భాస్కరరావు, 35వ వార్డు కార్పొరేటర్.

సంక్షేమానికి పెద్దపీట

కేక్ కట్ చేసి నాలుగేళ్ల సంబరాలు జరిపిన సీతంరాజు సుధాకర్



జగనన్న నాలుగేళ్ల పాలన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సీతంరాజు సుధాకర్

అల్లిపురం: జగనన్న నాలుగేళ్ల పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సీతంరాజు సుధాకర్ అన్నారు. నాలుగేళ్లలో 98 శాతం హామీలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 33వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో వెంకటేశ్వరమెట్టపై శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్‌కట్ చేసి నాలుగేళ్ల సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గం సీటు ఎవరికి ఇచ్చినా వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలుస్తారని, ఆయన సారథ్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్పొరేటర్లు చెన్నా జానకిరామ్, ఉరుకూటి నారాయణ, ఆళ్ల శ్రీను, కొప్పుల వెంకటరావు, యాండ్రపు నికిలేష్, గవర రమణ, మేడం నారాయణరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, భీశెట్టి రాజు, ఆడారి వెంకట మహేష్, ఊర్వశి, పోలవరపు ప్రసాద్, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తప్పనిసరి



వృద్ధురాలి నుంచి ఉమ్మి సేకరిస్తున్న టీబీ హెచ్‌వీ రత్నం, ఆశ వర్కర్

అల్లిపురం: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని టీబీ హెచ్‌వీ రత్నం, ఆశ వర్కర్ బి.లీలావతి 33వ వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం వెంకటేశ్వరమెట్ట–1 సచివాలయం పరిధిలో గల గోవింద్‌రోడ్డు, మిరపకాయల వీధి ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి టీబీ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనుమానం ఉన్నవారి వద్ద నుంచి ఉమ్మి సేకరణ చేపట్టారు. మలేరియా టెక్నీషియన్ అప్పారావు జ్వరం వచ్చిన వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు.

చిన్నారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ..

వేసవి ఎండల కారణంగా వృద్ధులు, చిన్నారులు డీ హైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉన్నందున ఆశ వర్కరు లీలావతి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, అవసరమైన వారికి జింక్ టానిక్‌లు అందజేశారు. అదే విధంగా డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా వారంలో ఒక రోజు నీటిని నింపే పాత్రలను శుభ్రపరచాలని, పూల కుండీల్లో నీటి నిల్వలు ఉంచరాదని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తద్వారా దోమల వ్యాప్తిని నివారించవచ్చని గృహస్తులకు ఆశ వర్కర్ సూచించారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 15.50 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీలు లెక్కించారు. 44 రోజులకుగాను అమ్మవారి హుండీల ఆదాయం రూ.15,51,756 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.వసంత్‌కుమార్ పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ జి.వరహాలబాబు, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పైపూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ కెరీర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోండి



ఏపీ కెరీర్ పోర్టల్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సంజీవకుమార్

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం ఏపీ కెరీర్ పోర్టల్ వినియోగంపై సెయింట్ ఆంథోని ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డి. సంజీవకుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏపీ కెరీర్ పోర్టల్ ఉపయోగాలు, లాగిన్ విధానంపై వివరించారు. చిన్న వయసు నుంచే ఒక లక్ష్యం ఏర్పరుచుకోవాలని నీతికథ ద్వారా తెలియజేశారు. ప్రభుత్వం రూపొందించిన కెరీర్ పోర్టల్‌ను ఉపయోగించుకుని లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు, రాజేంద్ర వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

స్థానిక రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చిన్నారులకు కథలు చెప్పారు. 36వ వార్డు శానిటరీ సెక్రటరీ టి. అప్పలరాజు, పి. నూకరాజు పాల్గొని విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల నష్టాలు తెలిపారు. ప్లాస్టిక్ సంచులు వద్దు.. నార సంచులే ముద్దంటూ పిల్లలకు ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పోలితల్లి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీచ్‌లో వ్యక్తి గల్లంతు



గల్లంతయిన అప్పలస్వామి



హెలికాప్టర్ ద్వారా గాలిస్తున్న దృశ్యం

అల్లిపురం: కుటుంబ సభ్యులతో గొడవ పడి వ్యక్తి బీచ్‌లో గల్లంతయిన ఘటన మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాణిపేట, కృష్ణానగర్‌కు చెందిన అలజాని అప్పలస్వామి భార్యతో గొడవపడి చనిపోతానని బీచ్‌కి వెళ్లి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు వారించినా వినకుండా ఉదయం 9.30 గంటలకు ఏఎస్ బీచ్ ఆస్పత్రి ఎదురుగా గల బీచ్‌లోకి దిగి గల్లంతయినట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో బీచ్ గార్డ్స్ సాయంత్రం వరకు గాలించినా అతని ఆచూకీ తెలియరాలేదు.

మాతృభాషతో పాటు ఇంగ్లిష్ కూడా అవసరం



మాట్లాడుతున్న రచయిత జీవన్‌కుమార్

సీతంపేట: మాతృ భాషతోపాటు ఆంగ్ల భాష అవసరం ఎంతో ఉందని, అమెరికన్ ఇంగ్లిష్ భవిష్యత్ దోహదకారని లెగ్జిగ్రాఫర్ వీఎస్వీ తెలుగు–ఇంగ్లిష్ డిక్షనరీ రచయిత సనపల జీవన్‌కుమార్ అన్నారు. తన్మయి క్రియేటివ్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అమెరికన్ ఇంగ్లిష్ శైలిపై రెండు రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికన్ ఇంగ్లిష్ శైలి, గురి, వినియోగం, ఆంగ్లం–అమెరికన్ ఇంగ్లిష్‌కు సంబంధించి కొన్ని పదాలు పలికి సంభాషించడం, వాక్య నిర్మాణాలు సోదాహరణంగా వివరించారు. సనాతన ధర్మం, మొండి ఘటం, పెళ్లిచూపులు, కొబ్బరి బొండాం వంటి రోజువారి పదాలను ఆంగ్ల వెర్షన్, కోమాలిమ్ వంటి ఆంగ్ల పదాల రీతులను ప్రస్తావించారు. కార్యక్రమంలొ తన్మయి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.ఎస్.చంద్రశేఖర్, కార్యదర్శి సిహెచ్.వి.సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు నాగసబోయిన నాగేశ్వరరావు, కొణతాల రాజు, బాందంగీర్ సాయి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పునః పరిశీలనకు వినతి

ఎంవీపీ కాలనీ: తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఓటరు జాబితాను పునః పరిశీలించాలని కలెక్టర్ మల్లికార్జునను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత కొన్నేళ్లుగా విడుదల చేస్తున్న ముసాయిదా ఎన్నికల జాబితాలో అనేక ఓట్లు గల్లంతవుతున్నాయన్నారు. పోలీంగ్ బూత్‌లు 20, 24, 27, 39, 77, 104, 116 పరిధిలో వందల ఓట్లు గల్లంతైనట్లు కలెక్టర్ దృష్టికి ఆయన తీసుకెళ్లారు. ఇప్పటికైనా జాబితాను పునఃపరిశీలించాలని, ఓటర్ జాబితాలో జరిగిన అవకతవకలను సరిచేసి కొత్త ఓటర్ జాబితాను విడుదల చేయాలని కోరారు.

క్లుప్తంగా

పరిశీలించి.. అనుమతులివ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో పలువురు అధికారులు

మహారాణిపేట: కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అధ్యక్షతన ఏఆర్‌టీ అండ్ సరోగసీ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ ఏఆర్‌టీ, సరోగసీ కోసం 5 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో గైనకాలజిస్టు డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ పీడియాట్రీషన్ డాక్టర్ చక్రవర్తి, ఎన్‌జీవో ఎల్.వి.రమణి, మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం పేరు చెప్పి వసూళ్లకు పాల్పడితే చర్యలు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట దేవస్థానం అధికారులు, సిబ్బంది పేరు చెప్పి అనధికార వసూళ్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని, దేవస్థానం పేరిట తప్పుడు ప్రచారం నమ్మి మోసపోవద్దని వెంకటేశ్వరమెట్ట దేవస్థానం ఈవో జేవీ రమాబాయి ఒక ప్రకటనలో హెచ్చరించారు. దేవస్థానం అధికారులు, సిబ్బంది పేరుతో కొంత మంది అనధికారిక వసూళ్లు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి వసూళ్లకు దేవస్థానంతో ఎటువంటి సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. అల్లిపురంలోని వెంకటేశ్వరమెట్ట దేవస్థానం హక్కుభుక్తమైన భూముల యందు క్రయ విక్రయాలను రిజిస్ట్రేషన్ శాఖ నిషేధించిందని పేర్కొన్నారు. ఈ భూములపై ఎట్టి క్రయ విక్రయాలు చేసినా అవి చెల్లవని తెలిపారు. ఆ భూములపై అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని, నిర్మాణం చేపట్టిన ఎడల వారిపై దేవదాయ శాఖ చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

పౌర గ్రంథాలయంలో కెరీర్ వింగ్ ప్రారంభం



కెరీర్ వింగ్‌ను ప్రారంభిస్తున్న భాస్కర్‌రామ్

సీతంపేట: రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.భాస్కర్ రామ్, రోటరీ విశాఖ పోర్టు సభ్యులు శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భాస్కర్ రామ్ బాలికల కెరీర్ వింగ్‌ను ప్రారంభించారు. ఈ విభాగానికి రోటరీ విశాఖ పోర్టు సిటీ వారు ఫర్నిచర్, టర్న్ షైల్ సమకూర్చారు. అనంతరం జరిగిన సమావేశంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, సభ్యుడు ఎ.ప్రసన్న కుమార్ గ్రంథాలయ చరిత్రను, ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు యు.శర్మ, సభ్యులు విశ్వనాథ్, గ్రంథాలయ అధ్యక్షుడు ఎస్.విజయ్‌కుమార్, సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగాపై అవగాహన కల్పిస్తున్న భాగ్యశ్రీ

మురళీనగర్: ప్రతి రోజు కొంత సేపు యోగ సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సచివాలయ మహిళా పోలీస్ ఎం. భాగ్యశ్రీ అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేకువజామున లేచి యోగా చేస్తే రోజంతా చురుగ్గా పని చేయగలుగుతారని, ఒత్తిడి నుంచి బయటపడవచ్చని చెప్పారు. ఖాళీ సమయాల్లో టీవీ, మొబైల్ ఫోన్ చూడటం బదులు పుస్తకాలు చదవాలన్నారు. కార్యక్రమాన్ని లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షించారు.